

మొక్కజొన్న, ధాన్యం బీట్లు

ధారూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం మొక్కజొన్న, ధాన్యం బీట్లు నిర్వహించారు. మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2,140 నుంచి 2,290, ధాన్యం 1010 రకం క్వింటాల్‌కు 1,870 నుంచి 1,950, సోనా క్వింటాలుకు రూ.2,050 నుంచి రూ.2,150 పలికాయి. కాగా మార్కెట్‌లో మొక్కజొన్న 1,179 క్వింటాళ్ల, ధాన్యం 534.4 క్వింటాళ్ల క్రయవిక్రయాలు జరిగాయని మార్కెట్ అధికారి సిద్ధమ్మ తెలిపారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

తాండూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రక్తదానం మరొకరికి ప్రాణదానం అని, అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ రక్త దానం చేయాలని తాండూరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్‌కుమార్ అన్నారు. శనివారం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. కృత్రిమంగా ఏదైనా సృష్టించగలమని, రక్తాన్ని మాత్రం ఎవరూ తయారు చేయలేరని పేర్కొన్నారు. ఆపద సమయంలో రక్తన్ని దానం చేసేందుకు యువకులు, యువతులు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. అంతకు ముందు రక్త నిధి కేంద్ర సిబ్బంది ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ ఆనంద్‌గోపాల్ రెడ్డి, రక్త నిధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్‌కుమార్

మిమిక్రీ కింగ్ పట్నం కుర్రాడు!

- టీవీ రంగంలో రాణిస్తున్న రాసూరి శ్రీనివాస్
- యాంకరింగ్, యాక్టింగ్, మిమిక్రీతో గుర్తింపు
- సినీ, రాజకీయ నాయకులను అనుకరించడంలో దిట్ట
- ఎంపీ రఘునందన్‌రావు వాయిస్‌కు లక్షల్లో వ్యూస్

5



నిరుపేద వ్యవసాయ కుటుంబంలో పుట్టిన కుర్రాడు సమాజంలో తనకంటూ ఓ గుర్తింపు కావాలనే లక్ష్యంతో మిమిక్రీ నేర్చుకున్నాడు. దాన్నే వృత్తిగా మలుచుకొని టీవీ రంగంలో రాణిస్తున్నాడు. మిమిక్రీతో పాటు యాంకరింగ్, యాక్టింగ్ చేస్తూ క్రమక్రమంగా బుల్లితెరపై బిజీగా మారిన పట్నం కుర్రాడు రాసూరి శ్రీనివాస్‌పై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ఆదిభట్ల/ కందుకూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి)

ప్రత్యేకంగా ఉండాలనే లక్ష్యంతోనే..


ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్టు భవిరి రవి కార్యక్రమాలు టీవీలో చూసి ఆయనకు ఏకలవ్య శిష్యునిగా మారిపోయా. ఆయనే స్ఫూర్తిగా మిమిక్రీపై ఆసక్తిని పెంచుకున్న. సామాజిక కోణంలో సందేశమిస్తూ హాస్యాన్ని పంచుతున్న. మనం చేసేపని ఏదైనా నలుగురిని నవ్వించగలగాలి అన్నదే నా ఆలోచన. ఉద్యమ సమయంలో వందల ప్రదర్శనలు ఇచ్చాను. ప్రజలను చైతన్య పరిచి ఉద్యమం వైపు నడిపించిన దాంట్లో నా పాత్ర సంతృప్తినిచ్చింది.

– రాసూరి శ్రీనివాస్

ప్రైవేటు మాదిరిగా ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతి జిల్లాలో కొత్తగా 30 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ(పూర్వ ప్రాథమిక) తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినా జిల్లాకు మొండి చెయ్యే ఎదురైంది. రాష్ట్రంలో వెయ్యి ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలని ఏప్రిల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అయితే, 12 జిల్లాల్లోని 210 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ ప్రారంభించాలని బుధవారం విద్యా శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో వికారాబాద్ జిల్లాకు చోటు దక్కలేదు. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నా వికారాబాద్‌కు అవకాశం దక్కకపోవడం చర్చనీయాంశమైంది.



ఈ సారీ లేనట్లేనా!



- ప్రభుత్వ ఉత్తర్వుల్లో వికారాబాద్ జిల్లాకు దక్కని చోటు
- సీఎం, స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్నా జిల్లాకు మొండి చేయే..
- అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు

వికారాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రైవేట్ పాఠశాలలకే పరిమితమైన ప్రీ ప్రైమరీ తరగతులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోనూ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అక్కడక్కడ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ తరగతులు అంతంతమాత్రంగానే కొనసాగుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశాలు ఆశాజనకంగా లేవు. విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గుతున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడాన్ని గుర్తించిన ప్రభుత్వం.. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించాలనే నిర్ణయం తీసుకుంది. ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించడమే కాకుండా పిల్లలకు ఉచిత రవాణా సదుపాయం కల్పించాలనే ప్రతిపాదన కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ప్రైవేట్ పాఠశాలల్లో మూడేళ్లు నిండిన పిల్లలను నర్సరీలో చేర్చుకుంటుండగా, అదే ప్రభుత్వ పాఠశాలల్లో ఐదేళ్లు నిండితేనే ఒకటో తరగతిలో చేర్చుకుంటున్న విషయం తెలిసిందే.

ఈ ఏడాది మామూలే..

జిల్లాలో 776 ప్రాథమిక, 116 ప్రాథమికోన్నత, 176 ఉన్నత పాఠశాలలు ఉండగా, వాటిల్లో 68 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో 1,129 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటిలో మూడేళ్ల నుంచి ఆరేళ్ల వరకు 19,693 మంది చిన్నారులు ఉన్నారు.. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ఉన్న కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గత విద్యా సంవత్సరం ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించినా ఆశించిన స్థాయిలో కొనసాగడం లేదు. ఈ విద్యా సంవత్సరం జిల్లాలో ప్రతిపాదించినట్లుగా 30 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించి ఉంటే, 900 మంది వరకు చిన్నారులు చేరేందుకు అవకాశం ఉండేది. ఈ ఏడాది ప్రీ ప్రైమరీ

మిగతా 6వ పేజీలో...



లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్ రెడ్డి

వికారాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాజీపడదగ్గ కేసులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ మంచి అవకాశమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా కోర్టులోని నాలుగు కోర్టుల్లో మొత్తం 11,588 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్ర కిశోర్, జిల్లా న్యాయసేవ సెక్రటరీ న్యాయమూర్తి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయమూర్తి శాంతిలత, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, బార్ ప్రెసిడెంట్ బస్వరాజ్, ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శంకరయ్య, పీపీలు మేరాజ్ బేగం, దీపారాణి, న్యాయవాదులు సంపూర్ణనంద్, మాధవ్ రెడ్డి, వసుంధర, శ్రీనివాస్, రాజశేఖర్ రాజు, మోహన్ రాథోడ్, బార్ న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



సన్నాలకు అందని బోనస్

- నెల రోజులుగా ఎదురుచూపు
- వానాకాలం పెట్టుబడికి అగచాట్లు
- వెంటనే మంజూరు చేయాలని రైతుల డిమాండ్

6

విత్తనాలు తీసుకుంటేనే డీఏపీ!

మర్పల్లి మన గ్రోమోర్ ఎదుట రైతుల ఆందోళన


మన గ్రోమోర్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

మర్పల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు తీసుకుంటే తప్ప డీఏపీ ఇవ్వమని మన గ్రోమోర్ సిబ్బంది తెలపడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. మర్పల్లి మండల కేంద్రంలోని మన గ్రోమోర్‌లో కొంతకాలంగా డీఏపీ సరఫరా చేస్తున్నారు. అయితే ఇతర ఫర్టిలైజర్స్ దుకాణాల్లో డీఏపీ లేకపోవడంతో అదునుగా భావించిన సిబ్బంది రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గతంలో ఎకరాకు ఒక బస్తా అని నిబంధన పెట్టగా ప్రస్తుతం మొక్కజొన్న, జొన్న, కంది, పత్తి విత్తనాలతోపాటు ఇతర విత్తనాలు కొనుగోలు చేస్తేనే ఇస్తామని మెలిక పెట్టారు. ఇదేంటని ప్రశ్నిస్తే కంప్యూటర్ పని చేయడం లేదని చెప్పడంతో మన గ్రోమోర్ ఎదుట శనివారం ఆందోళనకు దిగారు. డీఏపీ కోసం రెండు, మూడు రోజులుగా మన గ్రోమోర్ చుట్టూ తిరుగుతూ నిబంధనల పేరుతో ఇవ్వడం లేదని వాపోయారు. విత్తనాలు కొనుగోలు చేస్తే తప్ప ఇచ్చే పరిస్థితి లేదని, నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ఇప్పటికైనా నిబంధనలు లేకుండా డీఏపీ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సంబంధిత మన గ్రోమోర్ సిబ్బంది వివరణ కోరగా తాము ఎలాంటి నిబంధనలు పెట్టడం లేదని, కంప్యూటర్ పని చేయకపోవడంతో విక్రయించడం లేదన్నారు. 420 బస్తాల డీఏపీ అందుబాటులో ఉందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులతో వివరణ కోరగా నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా గురుకుల విద్యార్థిని


విద్యార్థిని కావ్య

ఘట్‌కేసర్ రూరల్, జూన్14(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ పరిధిలోని అంకుశాపూర్ ప్రిన్స్టన్ కళాశాలలో నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ ఆర్మీ గురుకుల కళాశాలకు చెందిన వెలుదండి కావ్య ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా లాజిస్టిక్ విభాగంలో ఉద్యోగం సాధించింది. జూలై నుంచి దుండిగల్‌లోని ఏయిర్‌ఫోర్స్ అకాడమిలో శిక్షణ పొందుతున్నదని ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీలత తెలిపారు. ఆర్మీ, ఏయిర్‌ఫోర్స్ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కావ్య డిగ్రీ చదువుతున్నప్పుడే కళాశాలలో నిర్వహించిన యుపీఎస్సీ, ఆర్మీలో శిక్షణ తీసుకున్నారని పేర్కొన్నారు. ఆర్మీ కళాశాలలో చదివిన విద్యార్థులు ఆత్మస్థైర్యం, నిబద్ధత, క్రమశిక్షణ, పట్టుదలతో ఉంటారని చెప్పారు. ఏయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం సాధించిన కావ్యకు అధ్యాపకులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

'గురుకులాల ప్రవేశ పరీక్షలు రద్దు చేయాలి'

పరిగి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లు, గురుకుల పాఠశాలలకు ప్రవేశ పరీక్షను రద్దు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ ప్రభుత్వాన్ని కోరారు. మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లోని ప్రతిభ గల విద్యార్థులంతా ప్రవేశపరీక్షలతో మోడల్, గురుకుల పాఠశాలల్లోకి వెళ్లిపోతుండంతో మండల, జిల్లా పరిషత్ పాఠశాలలు తీవ్రంగా నష్టపోతున్నాయని, ఈ విధానంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పడిపోతుందన్నారు. ఉన్న విద్యార్థులకు ఎంత బాగా బోధించినా ఫలితాల్లో వెనుకబడాల్సి వస్తోందని తెలిపారు. కాబట్టి ప్రవేశ పరీక్షలు రద్దు చేసి లాటరీ విధానంలో విద్యార్థులను ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రైవేట్ స్కూళ్లలో పేదలకు విద్యనందించాలి



శ్లోకా స్కూల్‌ను ప్రారంభిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు

మహేశ్వరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యా సంస్థల్లోనూ సామాజిక న్యాయం పాటిస్తూ పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందించే దిశగా విద్యాసంస్థలు ముందుకుసాగాలని, పెద్ద విద్యాసంస్థల ఏర్పాటుతో తుక్కుగూడ ప్రాంతం మరోగచ్చిబౌలిగా మారనుందని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శనివారం తుక్కుగూడలో శ్లోకా ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే గొప్ప వ్యక్తులుగా మారేందుకు ప్రతీ విద్యార్థి కృషి, పట్టుదలతో చదవాలన్నారు. ఆధునిక సౌకర్యాలు, సువిశాల ప్రాంగణంలో శ్లోకా స్కూల్ ఏర్పాటు అభినందనీయమన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు సాంకేతిక పరమైన విద్యనందిస్తూ తల్లిదండ్రుల మన్ననలు పొందాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యాపార ధోరణికే ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రతీ తరగతిలో పేద విద్యార్థులను చేర్చుకొని దేశ భవిష్యత్తుకు ఊతం ఇవ్వాలని కోరారు. హైదరాబాద్‌కు, విమానాశ్రయానికి చేరువలో ఉన్న శ్లోకా స్కూల్ ప్రామాణిక విద్యాసంస్థగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యే కె.లక్ష్మారెడ్డి అందెల శ్రీరాములుయాదవ్, డి.భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, విద్యాసంస్థల చైర్మన్ బిట్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ సంగమేశ్వర గుప్తా, డైరెక్టర్ టి.శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్



చేవెళ్ల కోర్టులో మాట్లాడుతున్న సీనియర్ న్యాయమూర్తి దశరథ రామయ్య

చేవెళ్ల, జూన్14(ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నామని చేవెళ్ల సీనియర్ సివిఎల్ జడ్జి దశరథ రామయ్య అన్నారు. శనివారం చేవెళ్ల కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. ఈ లోక్ అదాలత్‌లో 1,271కేసులను పరిష్కరించి రూ.16.62లక్షల పరిహారం, చలానాలు ఇప్పించినట్లు తెలిపారు. ఆర్జీదారులు, కక్షిదారులు కలిసి రాజీకి వచ్చే కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు. వీటిల్లో చాలా వరకు మద్యం తాగి వాహనాలు నడపడం, ఆర్టీఏ, ట్రాఫిక్ చలానా కేసులు ఎక్కువగా ఉంటాయన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులను తిరిగి పైకోర్టుల్లో అప్పీలు చేసుకునే అవకాశముంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది శ్యామ్‌కుమార్, రిటైర్డ్ జడ్జి లక్ష్మణ్, బార్‌అసోషియేషన్ ఉపాధ్యక్షులు జి.కృష్ణాగౌడ్, నర్సింలు, లీగల్ కౌన్సిలర్ కుమార్, చేవెళ్ల సీఐలు భూపాల్ శ్రీధర్, వెంకటేశం, ట్రాఫిక్ ఏఎస్సై చందర్‌నాయక్, కోర్టు అధికారులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో
నిర్మాణాల కూల్చివేత



కూల్చివేతలు చేపడుతున్న రెవెన్యూ అధికారులు



షాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని, కూల్చివేతలతో పాటు చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని షాబాద్ తహసీల్దార్ అన్వర్ అన్నారు. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీవో చంద్రకళ ఆదేశాల మేరకు శనివారం హైతాబాద్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. హైతాబాద్‌లో సర్వే నంబర్ 8లో 60ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. కొందరు ఆక్రమణదారులు హైతాబాద్ మెయిన్ రోడ్డు, నక్కలపల్లి రోడ్డులో 30గుంటల భూమిని ఆక్రమించి వ్యాపార సముదాయాలను నిర్మించారన్నారు. వాటిని కిరాయికి ఇచ్చి దండుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి అని, వాటిని ఎవరూ ఆక్రమించొద్దని హెచ్చరించారు. ఎక్కడైనా ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు. 111జీవో పరిధి భూముల్లోనూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయమై ఎంపీడీవో, ఎంపీవోలకు సమాచారం ఇచ్చామని తెలిపారు. దీనిపై సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీచేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా కేసులు నమోదు చేస్తామని అధికారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జలాలుద్దీన్ ముల్తాన్ బాబా దర్గా ఉర్సు



బాబా దర్గాపై చాదర్ కప్పుతున్న భక్తులు

శామీర్‌పేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలోని జలాలుద్దీన్ ముల్తాన్ బాబా దర్గా ఉర్సు శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. ఉత్సవాలకు వివిధ గ్రామాల ప్రజలు తరలివచ్చారు. దర్గాపై చాదర్ కప్పి మొక్కులు తీర్చుకున్నారు. హైదరాబాద్ మలక్‌పేట నుంచి ఊరేగింపుగా సంతాల్ వచ్చి చాదర్ కప్పారు. భక్తులకు భోజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి వరకు ఖవ్వాలి నిర్వహించారు. నిర్వహకుడు అఫ్జల్‌ఖాన్ మాట్లాడుతూ.. నగరానికి చెందిన అఫ్జల్ అనే భక్తుడు దర్గా అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్ హాజీ, ఇమామ్ ఇమ్తియాజ్ అహ్మద్, హజ్ కమిటీ సభ్యుడు మహ్మద్ ముజీబుద్దీన్, సమియొద్దీన్, షఫియొద్దీన్, ఇర్ఫాన్, నిస్సార్ అహ్మద్‌ఖాన్, నజీం, అహ్మద్ ఖాన్, అజ్మత్, ఉబెద్, షోయబ్, జానీ, ఆరిఫ్, చాంద్‌పాషా, సాజిద్, ఇలియాజ్, వెంకటేశ్, నర్సింహారెడ్డి, అంజిరెడ్డి, ఖదీర్, సమీ, తదితరులు పాల్గొన్నారు.

కొంగరఖుర్దు భూ సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తా : కేఎల్లార్



తమ భూ సమస్యలను లక్ష్మారెడ్డికి వివరిస్తున్న రావిర్యాల రైతులు

మహేశ్వరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాల, కొంగరఖుర్దు (ఎ) సర్వే నంబర్ 73లో 43ఎకరాల అసైన్డ్ భూమిని రావిర్యాల దళితులు సాగుచేసుకుంటున్నారని, ఆ భూముల రైతులకు పరిహారం అందేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని గ్రామస్తులు మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కోరారు. ఈ భూములను 2009లో ప్రభుత్వం హౌసింగ్ బోర్డుకు కేటాయించగా భూముల స్వాధీనానికి బోర్డు యత్నిస్తోందని రైతులు శనివారం కేఎల్లార్‌కు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతులకు పరిహారం ఇవ్వకుండా భూముల స్వాధీనంపై రాష్ట్ర ఐటీ, రెవెన్యూ మంత్రులతో చర్చించి న్యాయం జరిగేలా చేస్తానన్నారు. ఆయన హౌసింగ్ బోర్డు అధికారులు, ఆర్డీవో, తహసీల్దార్లతో ఫోన్లో సమస్యపై తెలుసుకున్నారు. వీలైనంత త్వరలో కొంగరఖుర్దు భూసమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడి తగిన న్యాయం జరిగేలా శాయశక్తులా కృషిచేస్తానని రైతులకు కేఎల్లార్ హామీ ఇచ్చారు.

అనాథలకు ఉచిత విద్యనందించడం మహాద్భుతం



చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌ను ఆహ్వానిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకుడు ప్రజ్ఞారాజ్

మొయినాబాద్ రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అనాథలైన పిల్లలను మంచి మార్గనిర్దేశకులుగా తీర్చిదిద్దేందుకు ఉచితంగా విద్యను అందించడం మహా అద్భుతమని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకుడు సీఎస్.రంగరాజన్ అన్నారు. ఈ కార్యన్ని నిర్వహిస్తున్న లక్ష్యసాధన ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేసే వారికి చిలుకూరు వేంకటేశ్వరస్వామి వారి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన తెలిపారు. మొయినాబాద్ మునిసి పాలిటీ పరిధి చిలుకూరు సమీపంలో లక్ష్యసాధన ఫౌండేషన్ స్థాపించి 12ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వచ్చే నెల 12న జరిగే వార్షికోత్సవ వేడుకలకు హాజరు కావాలని ఫౌండేషన్ చైర్మన్ ప్రజ్ఞారాజు శనివారం రంగరాజన్‌ను ఆహ్వానించారు. రంగరాజన్ మాట్లాడుతూ... అనాథ పిల్లలను చేరదీసి వారికి విద్యను అందించడం ఎంతో మంచి నిర్ణయమని కొనియాడారు. ఫౌండేషన్ వార్షికోత్సవాల్లో తాను తప్పకుండా పాల్గొంటానని రంగరాజన్ అన్నారని ప్రజ్ఞారాజు తెలిపారు.

ఉద్యమాలతో నిరుపేదలకు న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న పాల్మాకుల జంగయ్య

కొత్తూర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వందేళ్లుగా సీపీఐ చేస్తున్న ప్రజా ఉద్యమాలతో నిరుపేదలు, కార్మికులకు న్యాయం జరుగుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య అన్నారు. కొత్తూర్‌లో నిర్వహించిన సీపీఐ మహాసభకు జంగయ్య హాజరై మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భరించి వంద సంవత్సరాలు అవుతోందని, దేశ వ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుపుకోవడం జరిగిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ లేకుంటే నిరుపేదలు అధోగతి పాలయ్యేవారన్నారు. నిరుపేదల శ్రమనుదోచుకుంటున్న పెట్టుబడిదారులు, భూస్వాముల విధానాలపై పార్టీ పోరాడుతోందన్నారు. పార్టీ నిరుపేదల పక్షానే నిల్చుంటుందన్నారు. దండకారణ్యంలో కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పి.పర్వతాలు, మండల కార్యదర్శి షకీల్, సంజీవకుమార్, నాయకులు జంగయ్య, ఎల్లయ్య, అజ్మత్‌అలీ, దేవమ్మ, రోజా తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల తర్వాత తెరుచుకున్న గౌరారం పాఠశాల

- ప్రభుత్వ బడికే పిల్లలను పంపాలని తల్లిదండ్రుల తీర్మానం
- ఎంఈవో పాండు చొరవతో తరగతుల ప్రారంభం



పాఠశాల ప్రారంభంలో విద్యార్థులతో ఎంఈవో పాండు, శ్రీనివాసాచారి

ఆమనగల్లు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లేక మూతబడ్డ గౌరారం ప్రాథమిక పాఠశాల శనివారం పునఃప్రారంభమైంది. స్థానికుల సహకారం, ఎంఈవో పాండు చొరవతో తరగతులు ప్రారంభమయ్యాయి. గౌరారం పాఠశాలలో విద్యార్థుల్లేక ఐదేళ్ల క్రితం మూతబడింది. తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేట్‌కు పాఠశాలలకు పంపుతున్నారు. బడిబాటలో భాగంగా అధికారులు ఇంటింటికి తిరిగి విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలను పరిరక్షించుకోవాలని ఈ నెల 9న గ్రామ సభ నిర్వహించారు. కలెక్టర్ నారాయణరెడ్డి, డీఈవో సుశీందర్‌రావు ఆదేశానుసారం 15మంది విద్యార్థులను పాఠశాలలో అడ్మిషన్ చేయించారు. శెట్టిపల్లిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసాచారిని గౌరారం స్కూల్ డిప్యూట్ చేశారు. ఎంఈవో పాండు తరగతులను, పాఠశాల పరిసరాలను, గదులను శుభ్రం చేయించి పునః ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈవోతో చర్చించి మరో ఉపాధ్యాయుని నియామకానికి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

మర్పల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం దామస్తాపూర్‌నకు చెందిన వివిధ పార్టీల నాయకులు ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. గృహలక్ష్మి పథకం కింద ప్రతీ పేద మహిళలకు 2,500 ఇస్తామని ఓట్లు దండుకొని మోసం చేసిందని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జైహింద్‌రెడ్డి, శాంతికుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



మంత్రి శ్రీనివాస్‌రెడ్డితో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, నాయకులు

చేవెళ్ల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని, సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డిని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇద్దరని వేర్వేరుగా సన్మానించారు. కార్యక్రమంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు బల్వంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన నాయకులు



మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన ప్రసన్నకుమార్‌శర్మ మండల నాయకులు

మంచాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మంచాలకు చెందిన ప్రసన్న కుమార్‌శర్మకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి వచ్చిన నేపథ్యంలో శనివారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీ చీఫ్‌ను శాలువాతో సత్కరించి తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎం.వెంకటేశ్‌యాదవ్, సత్తయ్య తదితరులు ఉన్నారు.

పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

వికారాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ-2023 రిపోర్టును వెంటనే అమలుచేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. 2023 జూలై నుంచి రాష్ట్ర ప్రభుత్వం పీఆర్‌సీ ఇవ్వకుండా డీఏలతో సరిపెట్టడం సరికాదన్నారు. 2023 జూలై నుంచి డీఏలతో పీఆర్‌సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగా పడిపోతోందని, సర్కారు స్కూళ్లలో మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో నర్సింగ్ తరగతులను ప్రారంభించాలని, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలన్నారు. ప్రైవేటు పాఠశాలలను ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాములు, ఉపాధ్యక్షులు నర్సిములు, జమున, కోశాధికారి మోహిస్ ఖాన్, నాయకులు బాబురావు, పవన్‌కుమార్, కృష్ణవేణి, సలీం,ముత్యప్పశివరాజ్, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో జాతీయ లోక్ అదాలత్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ కోర్టు సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ శనివారం ముగిసింది. న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి.అంజనేయులు, సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి లోక్ అదాలత్‌లో తీర్పులను చెప్పారు. 656 డ్రంకెన్ డ్రైవ్ కేసులకు రూ.11.78లక్షల జరిమానా విధించారు. 259 క్రిమినల్ కేసులు, రెండు సివిల్, రెండు బ్యాంకు కేసులను పరిష్కరించి 5.98లక్షల జరిమానాలు విధించారు. లోక్ అదాలత్ విజయవంతానికి సహకరించిన న్యాయవాదులను, సిబ్బందిని జడ్జి అభినందించారు.



లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న జడ్జి స్వాతిరెడ్డి

తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వినూత్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతో దేశం తెలంగాణ వైపు చూస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి త్వరితగతిన నిర్మించుకోవాలని లబ్ధి దారులకు సూచించారు. ఆమనగల్లు మండలం పోలేపల్లికి చెందిన కె.శ్రీనుకు మంజూరైన రూ.33వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును కాంగ్రెస్ జిల్లా నాయకుడు దారెడ్డి అంజన్‌రెడ్డి, మండ్లీ రాములుతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజారంజక పాలన ఓర్వలేకనే విపక్షాలు విషప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. పేదలు ఆర్థికంగా బలపడి రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే స్వార్థ శక్తులు ఓర్వలేక ప్రభుత్వంపై విమర్శలు సాగిస్తూ ప్రగతి నిరోధకంగా మారాయన్నారు. 18 నెలల కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గం గణనీయమైన ప్రగతి సాధించిందని చెప్పారు. రూ.600కోట్లతో రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మెరుగైన విద్యుత్ సరఫరాకు కొత్తగా 8సబ్ స్టేషన్లు, 650ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. రూ.200కోట్లతో ఖానాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని నారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ తాళ్ల రవీందర్, కాంగ్రెస్ నాయకులు జగన్, కాలె మల్లయ్య, వస్పుల మానయ్య, సుమన్, సూదిని కొండల్‌రెడ్డి, బాబ, విజయ్‌రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

దుక్కిలో కొంగల వేట!

శుక్రవారం రాత్రి వర్షం కురియడంతో రైతులు దుక్కులు దున్నుకుంటున్నారు. చిన్నతూండ్లలో రైతు ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా కొంగలు గుంపులుగా చేరి పురుగులను ఏరుకుతిన్నాయి. కొంగల గుంపు ట్రాక్టర్ ముందూ, వెనక పురుగులను ఏరుకున్నాయి. కొంగల గుంపు ట్రాక్టర్‌ముందు కూడా వాలడంతో ఒక్కోసారి ట్రాక్టర్ ఆపి అవి వెళ్లాక నడుపుతుండడం దారిన వచ్చిపోయే వారు వింతగా చూస్తుండిపోయారు.

- యాచారం, జూన్ 14(ఆంధ్రజ్యోతి)



దుక్కిలో పురుగులను ఏరుకుంటున్న కొంగలు

బస్సు సర్వీసుల రద్దుతో ...
ప్రయాణికుల తిప్పలు

- కోవిడ్ సమయంలో పలు గ్రామీణ రూట్లలో బస్సుల నిలిపివేత
- ఏళ్లయినా పునరుద్ధరించని ఆర్టీసీ



మేడిపల్లిలో బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న మహిళలు

యాచారం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కరోనా కాలం తర్వాత మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు బందై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు ఇష్టానుసారం బస్సులు నడుపుతుండడంతో విద్యార్థులు, ప్రయాణికులు యాతన పడుతున్నారు. బస్సులు ఎప్పుడొస్తాయో తెలియక ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఉదయం పూట కొత్తపల్లి, తక్కళ్లపల్లి, యాచారం మీదుగా ఇబ్రహీంపట్నం వరకు.. తాటిపర్తి, నానక్‌నగర్, మేడిపల్లి గ్రామాల మీదుగా ఇబ్రహీంపట్నం వరకు బస్సులు నడవక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆమనగల్లు నుంచి పల్లెచెల్కతండా మీదుగా మేడిపల్లి నుంచి మాల్ వరకు ఉదయం, సాయంత్రం బస్సు నడిచేది. ఇప్పుడాసర్వీసు రద్దైంది. మంతన్ గౌరెల్లి-మాల్ మీదుగా ఇబ్రహీంపట్నం వరకు నడిచే బస్సునూ రద్దుచేశారు. ఇబ్రహీంపట్నం నుంచి యాచారం మీదుగా కందుకూరు వరకు నడిచే మూడు షటిల్ బస్సులను అధికారులు రద్దు చేయడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్సుల్లేక ఆటోల డ్రైవర్లు చార్జీలు భారీ గా పెంచారని ప్రయాణికులు చెబుతున్నారు. గతంలో ఇబ్రహీంపట్నం నుంచి యాచారం మీదుగా కడ్తాల వరకు రెండు బస్సులు నడిచేవి. ఇప్పుడు ఒకే బస్సు నడుస్తోంది. అదీ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. ఇబ్రహీంపట్నం నుంచి ఆకులమైలారం వరకు నడిచే మూడు బస్సుల్లో నేడు ఒకటికి తగ్గింది. హైదరాబాద్ నుంచి చంద్రాయణగుట్ట, తుక్కుగూడ, రాచలూరు మీదుగా ఆకులమైలారానికి తిరిగే మరో బస్సునూ డిపో అధికారులు రద్దు చేశారు. చార్మినార్ నుంచి కందుకూరు, మీర్‌ఖాన్‌పేట గ్రామాల మీదుగా యాచారం వరకు తిరిగే రెండు బస్సులను రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు, రైతు లు, ఆటోల్లో వెళ్తున్నారు. రైతులు పంట ఉత్పత్తులను డీసీఎంలలో సరకులను నగరానికి చేరవేస్తున్నారు.

మొత్తం 45 సర్వీసుల రద్దుతో తిప్పలు

ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో అధికారులు వివిధ రూట్లలో 45బస్సు సర్వీసులను రద్దుచేయడంతో మండల ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. మాల్ నుంచి హైదరాబాద్ ఐఎస్‌సదన్ వరకు రెండు షటిల్ బస్సులు నడపాలని ప్రయాణికులు, ప్రజాప్రతినిధులు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇబ్రహీంపట్నం డీఎంకు, ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు వినతిపత్రాలిచ్చినా ఫలితం లేదు. ఇప్పుడు ఆ గ్రామాలకు నడుస్తున్న నైట్‌హాల్ట్ సర్వీసులను సైతం రద్దు చేసేందుకు ఆర్టీసీ ఉన్నతాధికారులు యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యార్థులకూ తిప్పలే...

ఇబ్రహీంపట్నం నుంచి పల్లెచెల్కతండా నుంచి యాచారం వరకు, తిరిగి సాయంత్రం నాలుగున్నర గంటలకు యాచారం నుంచి పల్లెచెల్కతండా వరకు గతంలో బస్సులు నడిచేవి. ఇబ్రహీంపట్నం నుంచి యాచారం మీదుగా మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి వరకు ఉదయం 9గంటలకు, తిరిగి సాయంత్రం బస్సులు నడిచేవి. కరోనా నుంచి గ్రామాలకు నడిచే బస్సులను రద్దుచేశారు. స్కూళ్లు తెరిచిన నేపథ్యంలో గ్రామీణ సర్వీసులను పునరుద్ధరించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. సమస్యపై ఇబ్రహీంపట్నం డీఎం వెంకటనర్సప్పను స్పందన కోరగా ప్రతి గ్రామానికి బస్సులు నడిపి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సమయానికి బస్సులు నడపాలి



పాఠశాలలు తెరిచిన సందర్భంగా విద్యార్థుల కోసం గ్రామాలకు ఉదయం, సాయంత్రం వేళ బస్సులు నడిపేందుకు ఇబ్రహీంపట్నం డిపో అధికారులు చర్యలు తీసుకోవాలి. పల్లెచెల్కతండా, తాటిపర్తి, కుర్మిద్ద, యాచారం నుంచి కందుకూరు మండల కేంద్రం వరకు బస్సులు నడపాలి. మాల్ నుంచి ఇబ్రహీంపట్నం మధ్య నిరంతరం షటిల్స్ నడపాలి.

- ఎ.నర్సింహ, సీపీఎం నాయకుడు

మిమిక్రీ కింగ్
పట్నం కుర్రాడు!

- టీవీ రంగంలో రాణిస్తున్న రాసూరి శ్రీనివాస్
- యాంకరింగ్, యాక్టింగ్, మిమిక్రీలతో గుర్తింపు
- సినీ, రాజకీయ నాయకుల అనుకరణలో దిట్ట



ఓ చానల్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న శ్రీనివాస్(ఫైల్)

ఆదిభట్ల/కందుకూరు,జూన్14(ఆంధ్రజ్యోతి): కందుకూరు మండలం కొలన్‌గూడకు చెందిన రాసూరి నర్సింహ-శంకరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో పెద్ద కొడుకు శ్రీనివాస్. చదువుకునే వయసులోనే ఉపాధ్యాయుల మాటలను అనుకరిస్తూ మిమిక్రీపై ఆసక్తి పెంచుకున్నాడు. చదువుకుంటూనే చిన్న చిన్న స్టేజీ ప్రోగ్రాంలు చేస్తుండేవాడు. మిమిక్రీపై ఉన్న ఆసక్తితో డిగ్రీ మొదటి సంవత్సరం చేస్తూనే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో మిమిక్రీలో డిప్లొమా చేశాడు. ఓ టీవీ న్యూస్ చానల్‌లో హాస్యం జోడించి సెటైరికల్ ప్రోగ్రాంలో వాయిస్ ఓవర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. దీనికి శ్రీనివాస్ సెలక్ట్ అయ్యాడు. సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ వాయిస్‌తో ఉండే ఈ కార్యక్రమం అప్పట్లో ప్రజాదరణ పొందింది. అంతే కాకుండా మరో చానల్‌లో కేసీఆర్, వైఎస్ జగన్‌ను ఇమిటేట్ చేసి గుర్తింపు తెచ్చుకున్నారు. అలాగే వివిధ టీవీ చానళ్లలో లైవ్‌ప్రోగ్రాంలు, స్పెషల్ ఈవెంట్లకు యాంకరింగ్‌లు చేస్తూ బుల్లితెరపై ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని బిజీగా మారాడు.

మూస ధోరణులకు భిన్నంగా ...

మిమిక్రీ ఆర్టిస్టులు సాధారణంగా పాతతరం నటుల, రాజకీయ నాయకుల గొంతును అనుకరిస్తుంటారు. శ్రీనివాస్ మాత్రం ఈ మూసధోరణికి భిన్నంగా సినీ, రాజకీయ నాయకుల మాటలను అవలీలగా అనుకరిస్తారు. సినీ నటుల్లో నాటితరం ఎన్టీఆర్, ఏఎన్నార్, బాలకృష్ణ, చిరంజీవి, నాగార్జున, పవన్‌కల్యాణ్, శ్రీహరి, రవితేజ, ప్రభాస్, జీవిత, రాజశేఖర్, ప్రకాశ్‌రాజ్... కమీడియన్లు బ్రహ్మానందం, బాబుమోహన్, చిదంబరం, కొండవలస, ధర్మవరం సుబ్రహ్మణ్యం, రాజకీయ నాయకులు వైఎస్సార్, చంద్రబాబు, రోశయ్య, కేసీఆర్, వైఎస్ జగన్, షర్మిల, లక్ష్మీపార్వతి, బొత్స సత్యనారాయణ, వీహెచ్.హన్మంత్‌రావు, ఎం. సత్యనారాయణ, జి.కిషన్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం లాంటి వారితో పాటు ఇంకా ఎన్నో గొంతులను అవలీలగా అనుకరిస్తూ హాస్యం పండిస్తారు.

సమాజ చైతన్యమే లక్ష్యంగా

చిన్నతనం నుంచి చిత్ర కథలు రాయడం అలవాటు ఉండేది. మిమిక్రీ తోపాటు సమాజంలోని అసమానతలపై లఘు చిత్రాలు తీయాలనే ఆలోచన వచ్చిందే తడవుగా ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. కథ, దర్శకత్వం నిర్వహిస్తూ సొంతంగా లఘు చిత్రాలు తీశారు. బాల్యం నుంచి సామాజిక సేవా భావం ఉండటంతో నేటి అనేక సామాజిక రుగ్మతలను తన కోణంలో చూపించాలనే తపనతో లఘు చిత్రాలను ఆవిష్కరించారు. సామాజిక విషయాలే ఇతివృత్తంగా కథలల్లి సజీవంగా కళ్ల ముందు ఉంచుతూ తనకంటూ ప్రత్యేకతను నిరూపించుకుంటున్నాడు. నేడు విద్యార్థులను, యువకులను ప్రభావితం చేస్తున్న సామాజిక మాధ్యమాల వల్ల జరిగే అనర్థాలపై సందేశాత్మక అంశాలను జోడించి తీసిన ఫేక్‌బుక్ లఘు చిత్రం పలువురి ప్రశంసలు అందుకుంటోంది.

బలమైన ఆర్థిక శక్తిగా భారత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, పాల్గొన్న బీజేపీ జిల్లా నాయకులు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పేదల కష్టాలు తెలిసిన ప్రధాని నరేంద్రమోదీ కృషిఫలితంగా ప్రపంచంలో భారత్ నాల్గో అతి పెద్ద ఆర్థిక శక్తి సాధించిన దేశంగా ఎదిగిందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బీజేపీ 11ఏళ్ల పాలనపై శనివారం షాద్‌నగర్‌లోని ఓ కాంప్లెక్స్‌లో సమావేశం నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథి రఘునందన్‌రావు విలేకరులతో మాట్లాడారు. దేశ స్థితిగతులు తెలిసిన వ్యక్తిగా రాజకీయాల్లోకి అడుగిడిన నరేంద్ర మోదీ ప్రధానిగా పదకొండేళ్లలో ఎంతో అభివృద్ధి సాధించి, దేశాన్ని ప్రపంచంలో అగ్రదేశాల సరసన చేర్చారన్నారు. ప్రపంచ దేశాలు ఉలిక్కిపడేలా దేశ రక్షణ రంగాన్ని పటి ష్టం చేశారన్నారు. తీవ్రవాదాన్ని అణచేస్తూ, ఆపరేషన్ సిందూర్ చేపట్టి టెర్రరిస్టులను ఏరివేశారని తెలిపారు. ఇద్దరు ఆడపడుచులు ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా పూర్తిచేస్తే కాంగ్రెస్ కూటమి నాయకులు అవహేళనగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ పల్లెలో పచ్చదనం, పారిశుధ్యం లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఇంటింటికి మరుగుదొడ్డి, ప్రతీ వీధిలో సీసీ రోడ్ల నిర్మాణం చేశామని చెప్పారు. పేదలకు ఉచిత బియ్యం పంపిణీ కేంద్ర ప్రభుత్వ పథకమే అని తెలిపారు. దేశంలో హైవేల అభివృద్ధి, రైల్వే స్టేషన్లు, లైన్ల ఆధునికీకరణను పూర్తి చేస్తోందని అన్నారు. పాలమూరు ఎంపీగా గెలిపిస్తే పాలమూరు-రంగారెడ్డి లిఫ్టును కుర్చీ వేసుకొని పూర్తి చేయిస్తానని చెప్పిన మాజీ సీఎం కేసీఆర్ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను పట్టించుకోలేదని, అదే బాటలో నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం నడుస్తున్నారని ఆరోపించారు. దక్షిణ తెలంగాణను అభివృద్ధి చేయకుండా రేవంత్‌రెడ్డిని ఎవరైనా అడ్డుకుంటున్నారా? అని ఎంపీ ప్రశ్నించారు. ఆయన పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తే రైతులు హర్షిస్తారన్నారు. దేశాన్ని అభివృద్ధి చేస్తున్న బీజేపీని రాష్ట్ర ప్రజలు ఆదరించాలని రఘునందన్‌రావు కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్ అధ్యక్షతన సమావేశంలో ముఖ్య నాయకులు ప్రేమ్‌రాజ్, అంజన్‌కుమార్‌గౌడ్, నర్సింహారెడ్డి, రత్నం, మల్లారెడ్డి, బి.ప్రతాప్, శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, వెంకటేశ్ ఎగుప్తా, భూపాలచారి, టి.విజయ్‌కుమార్, కందూరి మనోహర్‌రెడ్డి, అశోక్, హరిభూషన్, చెట్ల వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గద్దె దింపడమే లక్ష్యం

కొత్తూర్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దింపడం కోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ పిలుపునిచ్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను నెరవేర్చడం లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అందె బాబయ్య, ఎస్.శ్రీవర్ధన్‌రెడ్డి, పి.విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, ఎస్టీ సెల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మోహన్‌సింగ్, ప్రతాప్‌రెడ్డి, రఘుపతి రెడ్డి, మాణిక్యం, నర్సింహ, రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్

మెయిన్ రోడ్డును విస్తరిస్తే నష్టపోతాం



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసిన మెయిన్ రోడ్డు దుకాణాల వ్యాపారులు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం షాద్‌నగర్‌లో మెయిన్ రోడ్డును విస్తరిస్తే తీవ్రంగా నష్టపోతామని వ్యాపారులు ఎమ్మెల్యే శంకర్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. చౌరస్తా నుంచి రైల్వే స్టేషన్ వరకు ఉన్న హెచ్‌ఎండీఏ ప్లాన్ ప్రకారం విస్తరించాలని రోడ్డుకు ఇరు వైపులా 75ఫీట్ల వరకు మార్కింగ్ చేశారు. శనివారం వ్యాపారులు శనివారం ఎమ్మెల్యేను కలిసి ఆవేదనను వ్యక్తం చేశారు. 75ఫీట్లు విస్తరిస్తే కొందరి దుకాణాలు పూర్తి పోతాయని అన్నారు. అభివృద్ధికి మీరంతా సహకరించాలని, మాస్టర్ ప్లాన్ ప్రకారం కాకుండా ఎన్ని ఫీట్లు తీయాలో చెప్పాలని ఎమ్మెల్యే కోరారు. రోడ్డును విస్తరిస్తేనే భవిష్యత్తు ఉంటుందని, రోడ్డు ఇరుగ్గా వ్యాపారాలూ కష్టమే అన్నారు. ఇలాంటి అవకాశం మళ్లీ రాదన్నారు. వ్యాపారులతా సమావేశమై ఎన్ని ఫీట్లు అయితే బాగుంటుందో నిర్ణయించి, చెప్పాలని ఎమ్మెల్యే శంకర్ వారిని కోరారు. అయితే తగిన నిర్ణయం తీసుకోవడానికి ఆదివారం సాయంత్రం మెయిన్ రోడ్డు వ్యాపారులు సమావేశం కాబోతున్నారు.

పేదల సంక్షేమాన్ని ఓర్వలేని బీఆర్ఎస్



చరికొండలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో బీఆర్ఎస్ నాయకులు ప్రజలను మోసగించారే తప్ప పేదలకు ఒక్క ఇల్లూ మంజూరు చేయలేదని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పేదల సంక్షేమాన్ని బీఆర్ఎస్ నాయకులు ఓర్వ లేక కుట్ర రాజకీయాలు, విష ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. చరికొండలో శనివారం నాయకులు పర్యటించి లబ్ధిదారులకు బిచ్యానాయక్ ఆధ్వర్యంలో మంజూరు పత్రాలను అందజేశారు. అర్హులందరికి ఇళ్లు మంజూరు అవుతాయని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, నాయకులు మహేందర్, జహంగీర్‌అలీ, జవహర్‌లాల్ నాయక్, శంకర్, మధుగౌడ్, హీరాసింగ్, రాజేశ్, నరేశ్, శ్రీను, శ్రీకాంత్, భరత్‌కుమార్, రమేశ్, మహేశ్, సేవ్య, లక్ష్మణ్, రామకృష్ణ, సందీప్, కిషన్, లక్‌పతి పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో
నిరంతరం పరిశోధన జరగాలి

ఆదిభట్ల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): బీటెక్ పూర్తయిన విద్యార్థులు అంతటితో ఆగకుండా సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను నిరంతరం గమనిస్తూ పరిశోధనలు చేయాలని భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మాజీ కార్యదర్శి అజయ్‌ప్రకాశ్ సహాని అన్నారు. శనివారం మంగల్‌పల్లిల్లోని సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో 21వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్ని మాట్లాడారు. 1990 నుంచి సాంకేతిక రంగంలో కొత్తఅధ్యాయం మొదలైందన్నారు. టెక్నాలజీలో మార్పులొస్తున్నాయని, వాటి దిశగా పరిశోధనలు చేయాలన్నారు. తెలంగాణలో సీవీఆర్ కాలేజీ మెరుగైన విద్య, వసతి సౌకర్యాలు సమకూరుస్తున్నందునే విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉత్తీర్ణత సాధిస్తూ పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు పొందుతున్నారన్నారు. కాలేజీ చైర్మన్ డాక్టర్ రాఘవ వి.చెరబుడ్డి మాట్లాడుతూ.. 2021లో చేరిన విద్యార్థులు ప్లేస్‌మెంట్స్ పొందడంలో రికార్డ్‌ను నెలకొల్పారని, ప్రఖ్యాత కంపెనీల్లో యేటా రూ.70లక్షల వేతన ప్యాకేజీతో ఉద్యోగాలు పొందారని తెలిపారు. సంవత్సరానికి రూ.75లక్షలు వేతనం సంపాదించిన వికాస్‌రుషిని కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి, అకడమిక్ డీన్లు డాక్టర్ నయనతార, కె.లాల్‌కిషోర్, ఎంవీ.శేషగిరిరావు వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అజయ్ ప్రకాశ్

సన్నాలకు అందని బోనస్

- నెల రోజులుగా రైతుల ఎదురుచూపులు
- వానాకాలం పెట్టుబడికి అగచాట్లు
- వెంటనే మంజూరు చేయాలని డిమాండ్


కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు

కీసర రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యంపై ప్రభుత్వం ప్రకటించిన బోనస్ డబ్బులకు కీసర మండల పరిధిలోని రైతులు ఎదురు చూస్తున్నారు. ధాన్యం విక్రయించి నెలరోజులు గడుస్తున్నా బోనస్ డబ్బులు రాక పోవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో అన్నదాతలు సన్నరకాలు సాగు చేసేందుకు మొగ్గు చూపారు. ఆరుగాలం కష్టపడి, తెగుళ్ల బెడదను తట్టుకుని, అకాల వర్షంతో ఏర్పడిన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని సన్న రకాలను సాగు చేసారు. సిద్ధం చేసిన చేసిన ధాన్యాన్ని విక్రయించిన రైతులకు నిరాశే మిగిలింది. ప్రభుత్వం బోనస్ ఇస్తుందా లేదా? అని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ చర్యలతో సన్న రకాల సాగు

కీసర మండల పరిధిలోని రైతులు అధికంగా బోరు బావుల మీద ఆధారపడి సేద్యం చేస్తున్నారు. దీంతో వేసవి తీవ్రత వలన ఏర్పడే నీటి ఎద్దడి పరిస్థితులు రాకముందే పంట చేతికి వచ్చే విధంగా యాసంగిలో సాధారణంగా దొడ్డ రకాలు సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ చర్యలతో మండల పరిధిలో కొంత మంది రైతులు సన్న రకాలనూ సాగుచేశారు. వ్యవసాయ శాఖ అధికారుల గణాంకాల ప్రకారం మండల పరిధిలో యాసంగిలో దాదాపు 1,700 ఎకరాల్లో వరి సాగవుతోంది. 240మంది రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించారు. ఈ కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు మొత్తం 15,252 క్వింటాళ్లు కాగా ఏ గ్రేడ్ 13,016, సాధారణ రకం 707 క్వింటాళ్ల ధాన్యం విక్రయించారు. 1,529 క్వింటాళ్ల సన్న రకాల ధాన్యాన్ని విక్రయించారు. మే మొదటి వారం నుంచి కొనుగోల్లు ప్రారంభం కాగా ఇప్పటికీ ధాన్యం సేకరణ కొనసాగుతూనే ఉంది. దొడ్డు, సన్నరకాలకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో డబ్బులు రైతుల ఖాతాల్లో జమకాలేదు. ఇదిలా ఉండగా సన్న రకాలు విక్రయించిన ఏ ఒక్క రైతుకూ బోనస్ డబ్బులు అందలేదు. దిగుబడి రాక దిగాలుగా ఉన్న రైతులకు బోనస్ రాకపోవటంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వానాకాలం సాగుకు సన్నద్ధం

యాసంగి ముగిసి వానాకాలం పంటకాలం ప్రారంభమైంది. నారుమడులు వేసుకునే సమయం వచ్చేసింది. విత్తనాలకు, దున్నుకానికి పెట్టుబడి కొరకు నగదు కావల్సిన సమయం. దీంతో ప్రభుత్వం ఇప్పటి వరకు బోనస్ డబ్బులు మంజూరు చేయకపోవడంతో అన్నదాతలు మండిపడుతున్నారు. ఇప్పటికైనాఅధికారులు వెంటనే బోనస్ డబ్బులను ఖాతాల్లో జమచేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై కీసర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సెక్రటరీని సంప్రదించగా ధాన్యం కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు డబ్బులు ఖాతాల్లో జమ చేశామన్నారు. అయితే సన్నరకాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు వివరాలను జిల్లా అధికారులకు నివేదించా మని చెప్పారు. రెండురోజుల్లో బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమవుతాయని పైఅధికారులు వెల్లడించారని వివరించారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు


కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి మునిసిపల్ పరిధిలోని ఎనిమిదో వార్డు పరిధిలో వర్షం వల్ల కూలిపోయిన ఇంటిని ఆయన పరిశీలిం బాధితురాలు సమీనాబేగంకు భరోసా ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇల్లు మంజూరీ చేస్తానని చెప్పారు. అలాగే మహిళా సంఘం ద్వారా లక్షరూపాయలు అందజేస్తామని తెలిపారు. ఇల్లు లేదని ఎవరూ ఆందోళన చెందరాదని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల మంజూరీ చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, కుడుముల వెంకటేశ్ పాల్గొన్నారు.

కులకచర్ల: అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బోలుసాని భీమ్‌రెడ్డి అన్నారు. కులకచర్లలో శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్యతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు వెంకటయ్యగౌడ్, వెంకటేష్, కృష్ణయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి


పంటపొలాల్లో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): దళితుల అనుమతి లేకుండా దౌర్జన్యంగా పొలంలో నుంచి రోడ్డు వేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని దళిత ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తూర్ గ్రామంలో దళితులు నష్టపోయిన పంటను శనివారం వారు పరిశీలించారు. రోడ్డు నిర్మాణంతో రైతులు పంటలను నష్టపోయారని, అదే విధంగా పొలాల్లో నుంచి కాంట్రాక్టర్ అరవింద్ రెడ్డి అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బొంరాస్‌పేట్, మహంతీపూర్ నుంచి కొత్తూర్ వరకు వంతెన నిర్మాణాలు చేపట్టకుండా, రైతులతో మాట్లాడకుండా రోడ్డు వేయడంతో పంట పొలాల్లో నీరు నిలిచిందన్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా దళిత ప్రజాసంఘాల నాయకులు కొత్తూర్ చంద్రయ్య, ఎం.వెంకటయ్య, ఉప్పలి మల్కయ్య, బుస్స చంద్రయ్య లక్ష్మప్ప, డప్పు వెంకటయ్య పాల్గొన్నారు.

అడవులను నరికితే చర్యలు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

యాలాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అడవులను నరికేస్తే చర్యలు తప్పవని ధారూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.రాజేందర్ హెచ్చరించారు. మండల పరిధిలోని బాణాపూర్‌లో శనివారం అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై గ్రామ ప్రజలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు ప్రజలు అటవీ పరిధిలోని భూమిలోకి వచ్చి అడవులను నరికి వ్యవసాయం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. రాత్రివేళల్లో కొందరు అక్రమంగా ప్రవేశించి ట్రాక్టర్లు, జేసీబీ, డోజర్లతో అడవిని నాశనం చేస్తున్నారని అన్నారు. అలాచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. పదేపదే అడవిని నాశనం చేస్తే పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధారూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.రాజేందర్, సెక్షన్ ఆఫీసర్లు కనకరాజు, కాశన్న, బీట్ ఆఫీసర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 348 దరఖాస్తులు

కొడంగల్ రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకవచ్చి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకున్నారు. మండలంలో ఈ నెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు కొనసాగిన రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 348 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ విజయ్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో మిస్సింగ్ సర్వే నంబర్ల కోసం 60దరఖాస్తులు, పెండింగ్ మ్యుటేషన్ల కోసం 21దరఖాస్తులు, డిజిటల్ సిగ్నేచర్ల కోసం 28దరఖాస్తులు, ఎక్టెంట్ భూమి కోసం 40దరఖాస్తులు, భూమి స్వభావం కోసం ఐదు దరఖాస్తులు, పట్టాపాస్ బుక్‌ల పేర్లు సరిచేయడానికి 10దరఖాస్తులు, ప్రొహిబిటెడ్ ల్యాండ్ నుంచి తొలగించడానికి 24 దరఖాస్తులు, సక్సెషన్ కోసం 78 దరఖాస్తులు, 78 దరఖాస్తులు వివిధ సమస్యలతో కూడిన మొత్తం 348 దరఖాస్తులు వచ్చాయి.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

దోమ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందని మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం అన్నారు. మోత్కూర్ గ్రామానికి చెందిన దాదాపూరం అంజిలమ్మకు మంజూరైన రూ.14,500 చెక్కును శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా గుండాలలో రవినాయక్‌కు పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి రూ.12వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్యానాయక్, ఈట్యానాయక్, పెంటప్ప, కురువ బీరప్ప, దేవమ్మ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం


పరిగి: కేసులను పరిష్కరిస్తున్న న్యాయాధికారి శిల్ప

పరిగి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో కేసులను సత్వరమే పరిష్కరిస్తామని పరిగి మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి నాగుల శిల్ప అన్నారు. శనివారం కోర్టు హల్‌లో మెగా లోక్‌అదాలత్ నిర్వహించి కేసులను పరిష్కరించారు. ప్రధానంగా సివిల్ కేసులు, చెక్‌బౌన్స్, ఫ్యామిలీ, క్రిమినల్ కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేసుల్లోని ఇరు పక్షాలు రాజీపడి వస్తే కేసులను అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏజీపీ సీహెచ్ బాలముకుందం, బార్‌అసోషియేషన్ అధ్యక్షుడు ఇబ్రహీంఖాన్, లింగం, ఆనంద్‌గౌడ్, గౌస్‌పాష, వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: కొడంగల్ మున్సిఫ్‌కోర్టులో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 11 కేసులను పరిష్కరించినట్లు ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు. బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన 11 బీఎన్ఎస్ కేసులకు సంబంధించి ఇరువర్గాలు రాజీ కుదుర్చుకోవడంతో న్యాయమూర్తి శ్రీరాం పరిష్కరించినట్లు తెలిపారు. అదేవిధంగా 35 డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో జరిమానా విధించినట్లు తెలిపారు.

వికసించిన బ్రహ్మకమలాలు




ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో అలపాటి మల్లికార్జున్ రావు నివాసంలో శుక్రవారం రాత్రి బ్రహ్మకమలాలు వికసించాయి. ఆయన ఇంటి ఆవరణలో పలురకాల పూల మొక్కలు, తీగ జాతి మొక్కలు పెంచుతున్నాడు. ఇందులో భాగంగా ఉన్నబ్రహ్మకమలం మొక్కకు ఏకంగా 38పూలు వికసించాయి.

- ఘట్‌కేసర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి)

విమాన ప్రమాద మృతులకు నివాళి


విమాన ప్రమాద మృతులకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు బీజేపీ తాండూరు పట్టణ శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌక్‌లో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, దిశ జిల్లా కమిటీ సభ్యురాలు అంతారం లలిత, మాజీ కౌన్సిలర్ సాహు శ్రీలత, సాయిరెడ్డి, భద్రేశ్వర్ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): 4వ తరగతిలో తెలంగాణ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి మండలస్థాయి ఎంపికలు జరుగుతున్నాయని మండల విద్యాధికారి శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు 3వ తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని, 2017 ఆగస్టు 31 మధ్యలో జన్మించి ఉండాలన్నారు. పాస్‌పోర్టు సైజు ఫొటోతో ఘట్‌కేసర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలకు ఉదయం 9.30లకు రావాలని కోరారు. వివరాలకు 9640501084నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అబద్ధాలు చెప్పి ప్లాట్లు కొనిపించారు


నిరసన తెలుపుతున్న సాకేత్ ఫేస్-1 నివాసితులు

మేడ్చల్‌టౌన్, జూన్,14 (ఆంధ్రజ్యోతి): కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి సదరు బిల్డర్లు తమతో ప్లాట్లు కొనిపించి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సాకేత్ భూసత్వ ఫేస్-1 నివాసితులు ఆరోపించారు. శనివారం సాకేత్ ప్రణామం ఫ్రెండ్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో సాకేత్ భూసత్వ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రంగారావు, వల్లభేంద్రరెడ్డిలు మాట్లాడుతూ కాలనీలో సకల సౌకర్యాలు కల్పిస్తామంటూ సదరు వెంచర్ బిల్డర్లు నమ్మించి తమతో ప్లాట్లు కొనిపించారన్నారు. వసతులు కల్పించాలని కాలనీ వాసులు ఎన్నిసార్లు సదరు బిల్డర్లకు తెలియజేసిన వారు పట్టించుకోక పోవటంతో నిరసనకు దిగామని తెలిపారు. ఈ విషయంలో అధికారులు కల్పించుకుని కాలనీ వాసులకు న్యాయం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ (మహేంద్రహిల్స్) కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి బీఎస్సీ లైఫ్‌సైన్సెస్ కోర్సుకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ స్నేహలత తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఇంటర్ మెమో, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, దోస్త్ ఒప్పంద పత్రాలను వెంట తెచ్చుకోవాలని కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9121004524, 7993580010 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన


రక్తదానం ప్రారంభిస్తున్న సునీతాసంపత్

తాండూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రక్తప్రదాత, బీవీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. బాలాజీ నర్సింగ్‌హోమ్‌లో శుక్రవారం నిర్వహించిన ఈశిబిరానికి 54మంది రక్తదాతలు హాజరయ్యారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునిత సంపత్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా ఆస్పత్రికి చెందిన రక్తనిధి కేంద్ర బృందం సేవలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పట్లోళ్ల నర్సింహులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్, రవికుమార్, వడ్డె శ్రీనివాస్, సంతోష్ కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

సంఘటితంగా ఎదగాలి

కొడంగల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వీరశైవ సంఘం సభ్యులు సంఘటితంగా ఎదిగేందుకు కృషిచేయాలని సభ్యులు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీజగద్గురు నిరంజనమఠంలో శనివారం వీరశైవ సమాజ పట్టణ కమిటీ అధ్యక్షుడిగా జంగం శాంత్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో గడ్డం చంద్రశేఖర్‌ను పట్టణ పురోహితులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 16న మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న శ్రీ ఆది జగద్గురు పంచాచార్య యుగమానోత్సవం, శ్రీ బసవేశ్వర జయంతి ఉత్సవ కార్యక్రమాలను జయప్రదం చేయాలని పోస్టర్ విడుదల చేశారు. నలుగురు జగద్గురు పీఠాధిపతులు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరశైవ ధార్మిక సేవారత్న అవార్డును బుక్క బాలప్రకాశ్‌కు అందించనున్నట్లు తెలిపారు. పట్టణంలో శ్రీ బసవేశ్వర విగ్రహ ఏర్పాటుకు స్థలం ఇచ్చిన దాత శేరి బస్వరాజ్ పటేల్‌ను పట్టణ పురోహితులు గడ్డం చంద్రశేఖర్, బుక్క బాలప్రకాశ్‌లను సభ్యులు సన్మానించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీరశైవ సమాజం సభ్యులు

ఈ సారీ లేనట్లే!

(మూడో పేజీ తరువాయి)

తరగతుల నిర్వహణకు విద్యా శాఖ ఉన్నతాధికారులు అనుమతించిన జిల్లాలో మన జిల్లాకు చోటు దక్కలేదు.

ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసేందుకే..

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటేటా తగ్గిపోవడానికి ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన లేకపోవడమేనని తెలుస్తోంది. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం తరగతులు ప్రారంభించినప్పుడు ప్రీ ప్రైమరీ తరగతులను కూడా ప్రారంభించారు. ఆ సమయంలో ప్రవేశాలు కొంత పెరిగినా పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజన పంపిణీలో సమస్యలు ఉత్పన్నం కావడంతో ఆ తరగతులు కొనసాగలేవు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచే ప్రవేశాలు కల్పిస్తున్నారు. అదే ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ నుంచే ప్రవేశాలు కల్పిస్తుండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఆ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటేటా తగ్గుతున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభిస్తే ప్రైవేట్‌కు ధీటుగా బలోపేతమవుతాయనే అభిప్రాయం విద్యా కమిషన్ వ్యక్తం చేసిన నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించేందుకు విద్యా శాఖ కసరత్తు చేసింది. అయితే ఈ ఏడాది ప్రీ ప్రైమరీ స్కూళ్లు అనుమతించిన జిల్లాల్లో వికారాబాద్‌కు చోటు దక్కలేదు.

సంక్షిప్తంగా..

అర్హులకే ప్రభుత్వ పథకాలివ్వాలి

మోమిన్‌పేట్: అర్హులకే ప్రభుత్వ పథకాలు అందించాలని బీఆర్ఎస్ మండల నాయకుడు యం.బాలకృష్ణ గౌడ్ అన్నారు. ఆయన శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలను కాంగ్రెస్ కార్యకర్తలకే ఇస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

కొడంగల్: సిద్దనొంపు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 90వ శనివారం పూర్తయిన సందర్భంగా సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.


ఆపదలో అండగా ఉండాలి

వికారాబాద్: ఆపదలో ఉన్న వారికి అండగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. ఇందిరానగర్ కాలనీకి చెందిన యువకుడు దుర్గాప్రసాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మానవతా దృక్పథంతో వారి కుటుంబానికి శనివారం రూ.7వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కులకచర్ల: ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. ముజాహిద్‌పూర్ గ్రామంలోని గిరిజన బాలుర వసతి గృహం పరిసరాల్లో శనివారంమొక్కలు నాటారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని వాహనదారులు వాపోయారు. ఎన్కతల నుంచి ఆర్కతలకు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు ఇబ్బందులను కలిగిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను తీసివేయాలని కోరారు.

- మోమిన్‌పేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి)

క్రైం కార్నర్

మహిళ అదృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ అదృశ్యమైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ, చౌదరిగూడ వైష్ణవికాలనీకి చెందిన తూర్పునూరి అనిత(60) శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆమె కుమారుడు శ్రీనివాస్ తెలిసిన వారిని, బంధువులను అడిగి, పరిసరాలను వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో శనివారం ఉదయం పోచారం ఐటీ కారిడార్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలు

దోమ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బోయిని కిష్టప్పపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. శనివారం పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలో కుక్కలు అతడిపై దాడిచేశాయి. దాడిలో చేయికి గాయాలయ్యాయి. గ్రామంలో కుక్కల బెడదను నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

అంబులెన్స్‌లో ప్రసవం


అంబులెన్స్‌లో క్షేమంగా తల్లీబిడ్డ

కొడంగల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అంబులెన్స్‌లో ప్రసవించిన ఘటన కొడంగల్ మండలంలో జరిగింది. చిట్లపల్లి తండాకు చెందిన శ్రీవాణి గర్భిణి కాగా శుక్రవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారం అందించారు. తాండూర్‌కు తీసుకెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్ సిబ్బంది ఆమెకు ప్రసవం చేయగా మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉండటంతో కుటుంబసభ్యులు అంబులెన్స్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

భవిష్యత్ తరాలను ఆరోగ్యంగా తీర్చిదిద్దాలి


వేడుకల్లో మాట్లాడుతున్న సుభద్రాదేవి

శామీర్‌పేట జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి భవిష్యత్ తరాలను ఆరోగ్యంగా తీర్చిదిద్దాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ అర్బన్ (జీహెచ్ఎంసీ) అర్బన్ బయోడైవర్సిటీ వింగ్ అదనపు కమిషనర్ వీవీఎల్ సుభద్రాదేవి పిలుపునిచ్చారు. తూంకుంటలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సాగర్ ఆధ్వర్యంలో వనమహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ సుభద్రాదేవి విచ్చేసి అస్కూల్ ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం పర్యావరణాన్ని కాపాడాలని ప్రతిజ్ఞ చేశారు.

సైనికుల సంక్షేమ భవనం మంజూరు చేయాలి


ముఖ్యమంత్రికి వినతి ప్రతం అందిస్తున్న మాజీ సైనికులు

కొడంగల్ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సైనికుల సంక్షేమ భవనం మంజూరు చేయాలని కొడంగల్ నియోజక వర్గానికి చెందిన మాజీ సైనికులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో శనివారం మార్యాదపూర్వకంగా కలిసి మాజీ, సర్వీసులో ఉన్న సైనికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో కొడంగల్ నియోజక వర్గానికి చెందిన మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు జీ.రాములు, ఉపాధ్యాక్షులు బి.వెంకటయ్య, ఇంతీయాజ్ ఆలీ, వెంకటయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొనారు.

అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించాలి

పరిగి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జూలై ఏడున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో దిమ్మెలు నిర్మించి ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి గట్టగల్ల ప్రశాంత్ మాదిగ కోరారు. శనివారం పరిగిలో ఎమ్మార్పీఎస్ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో 30ఏళ్లుగా అవిశ్రాంత పోటం చేసి వర్గీకరణను సాధించుకున్నామని చెప్పారు. ఎస్సీ రిజర్వేషన్‌ల ఫలాలు మాదిగ యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనందం, ఎమ్మార్పీఎస్ జిల్లాఅధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధికార ప్రతినిధి ప్రకాష్, కర్రె భరత్‌కుమార్, రవి, వెంకట్‌రాంలు, లాజర్ పాల్గొన్నారు.

రైతు వేదికలకు వీసీ యూనిట్లు

బషీరాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని నవాల్గ, కాశీంపూర్ క్లస్టర్ గ్రామాల రైతు వేదికలకు రెండు వీసీ(వీడియో కాన్ఫరెన్స్) యూనిట్లు మంజూరయ్యాయి. ఈ యూనిట్లను ఆయా వేదికల్లో ఏర్పాటు చేసినట్లు వ్యవసాయాధికారిణి అనిత శనివారం తెలిపారు. వీసీల ద్వారా రైతులకు పంటల సాగు, సస్యరక్షణ చర్యలు, మార్కెటింగ్ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు, అధికారులతో శిక్షణ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. మండలంలో ఆరుగురు రైతులు వేదికలు ఉండగా ప్రతీ క్లస్టర్ ఒక వీసీ ఏర్పాటు చేస్తారన్నారు. ప్రస్తుతం మూడు క్లస్టర్లలో వీసీ యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేసిన కాంగ్రెస్ నాయకులు

మూడుచింతలపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మూడుచింతలపల్లి మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మూడుచింతలపల్లిలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఇల్లులేని ప్రతీ నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జగన్నాథం, వెంకటేష్, వెంకటరమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.